Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, జూలై 25, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## కుప్పకూలిన స్కూల్ బిల్డింగ్.. రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం



శుక్రవారం ఉదయం 8.30గం.ప్రాంతంలో మనోహర్ థానాలోని పిప్లోడి ప్రభుత్వ పాఠశాల భవనం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికుల సాయంతో టీచర్లు శిథిలాలను తొలగించే ప్రయత్నం మొదలుపెట్టారు. నలుగురు విద్యార్థుల మృతదేహాలను వెలికి తీశారు. శిథిలాల కింద మరో 40 మంది చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు, విద్యాశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సింగిల్ స్టోర్ స్కూల్ భవనం శిథిలావస్థలో ఉందని, మరమ్మత్తులు అవసరమని గతంలో పలు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

# పార్లమెంటులో పోరాడండి

## బీసీ రిజర్వేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



తనతోపాటు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు జంతర్ మంతర్ వద్ద పోరాడతామని వెల్లడి

రాష్ట్రంలో కులగణన సర్వేకు సంబంధించి మా వద్ద 88 కోట్ల పేజీల డేటా ఉంది

తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్..ఇది 'రేర్' సర్వే

సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 % ఉన్నారు

3.9% మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారు.. ఇదొక సరికొత్త పరిణామం

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ హామీ మేరకు తమ ప్రభు త్వం కుల గణన చేసి, ఆ మేరకు బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ బిల్లులను లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదింపజేసేందుకు రాహుల్‌గాన్ధీ, ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. తాను, తన మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలందరం జంతర్‌మంతర్ వద్ద పోరాడతామని చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి ప్రజల స్వీయ ధ్రువీకరణ పత్రంతో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే దేశానికే రోల్‌మోడల్ అని అన్నారు. ఈ సర్వేకు సంబంధించిన 88 కోట్ల పేజీల డేటా తమ వద్ద ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ఆమోదించిన బిల్లులపై..ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన సందర్భంగా సీఎం మాట్లాడారు.

### రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కులగణన

'భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మేము అధికారంలోకి వచ్చిన తర్వాత 2024, ఫిబ్రవరి 4వ తేదీన ఈ మేరకు సర్వేను ప్రారంభించి 2025, ఫిబ్రవరి 5న అంటే ఏడాది కాలంలోనే పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4ను తెలంగాణలో సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కులగణన చేపట్టే సమయంలో అనేకమంది అగ్ర కులాల నాయకులు నా వద్దకు వచ్చి అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తం చేశారు. కాలనుగుణంగా మార్పులకు అవకాశం ఇవ్వాలని నేను వారికి సూచించా. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 60 ఏళ్ల పాటు పోరాటాలు జరిగాయి. అనేక మంది అమరులయ్యారు. కానీ 2009, డిసెంబర్ 9న ప్రకటన చేయడంతో పాటు తెలంగాణ ఇచ్చి తెలంగాణ ప్రజల కలను సోనియాగాంధీ నెరవేర్చారు. అదే తెలంగాణలో కుల గణనపై రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని మా ప్రభుత్వం నెరవేర్చింది..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

### గాంధీ కుటుంబం ఇచ్చిన మాట నిలుపుకుంటుంది

'బీజేపీ నాయకులు చెప్పినవి ఏవీ చేయరు. గాంధీ కుటుంబం చెప్పిన ప్రతి మాటను నిలుపుకుంటుంది. కుల గణనకు సంబంధించి మా ప్రభుత్వం 56 ప్రశ్నలతో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి సమాచారం సేకరించింది. సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారు. 3.9 శాతం మంది తమది ఏ కులం కాదని

(మిగతా 2వ పేజీలో)



## ఈ నెల 26 నుంచి సింగపూర్‌లో సీఎం చంద్రబాబు పర్యటన

6 రోజుల పాటు సింగపూర్ లో పర్యటించనున్న చంద్రబాబు

కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు రెండో విదేశీ పర్యటన

బ్రాండ్ ఏపీ ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ లో పర్యటించనున్నారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు 6 రోజుల పాటు ఆయన సింగపూర్ లో పర్యటించి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం... రెండో విదేశీ పర్యటనగా సింగపూర్ కు వెళుతున్నారు. బ్రాండ్ ఏపీ ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టుబడులను సాధించేందుకు ఈ పర్యటనను వేదిక చేసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించి పెట్టుబడుదారులను ఆహ్వానించనున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ, 1053 కి.మీ తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నారు. అలాగే పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. 6 రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. మొదటి రోజు... సింగపూర్ సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే 'తెలుగు డయాస్పోరా' సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఏపీలో పెట్టబడులపై ఆయా దేశాల వారిని ఆహ్వానించనున్నారు. పేదరిక నిర్మూలనకు

(మిగతా 2వ పేజీలో)



## పార్లమెంట్‌లో రచ్చ రచ్చ

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై విపక్షాల ఆగ్రహం

వెంటనే చర్చ చేపట్టాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్

యథావిధిగా కొనసాగిన నిరసనలు, నినాదాలు ఉభయ సభలు పలుమార్లు వాయిదా

## రాష్ట్రానికి రెండ్రోజులు ఎల్లో అలర్ట్



మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని అంచనా

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



## కేంద్రం వద్దకు ఆర్డినెన్స్ ముసాయిదా!

కేంద్ర హెూం శాఖ న్యాయ సలహా కోరిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు వీలుగా పీఆర్ చట్ట సవరణకు సర్కారు యత్నం

రాష్ట్రం పంపించిన బిల్లుపై 32 అభ్యంతరాలు వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం!

హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టం-2018ని సవరించడంలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా ఆర్డినెన్స్‌ను.. న్యాయ సలహా కోసం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంకోవైపు ఇప్పటికే అసెంబ్లీ ఆమోదించిన బీసీలకు

(మిగతా 2వ పేజీలో)

# బనకచర్లకు మా సమ్మతి తప్పనిసరి

పోలవరానికి మేం సమ్మతినిచ్చినట్లేనన్న విభజన చట్ట నిబంధన దీనికి వర్తించదు

### కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ లేఖ



హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు తాము సమ్మతి ఇచ్చినట్లేనంటూ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 90 (3)లో ఉన్న నిబంధన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు వర్తించదని తెలంగాణ స్పష్టం చేసింది. పోలవరం విస్తరణలో భాగంగా చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు తమ అనుమతి తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని 95వ టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) పోలవరం ప్రాజెక్టును ఆమోదిస్తూ గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు అనుగుణంగా జారీ చేసిన ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్స్‌లో బనకచర్లతో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేసింది. రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించడానికి చేపట్టిన ప్రాజెక్టులో రోజుకు 3 టీఎంసీల జలాల తరలింపునకు వీలుగా ఏపీ సర్కారు సదుపాయాలను సృష్టిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పునర్విభజన చట్టం, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిబంధనలతోపాటు ఆ ప్రాజెక్టుకు జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియను చేపట్టరాదంటూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తాజాగా లేఖ రాశారు. 'అన్ని మిగులు జలాలు ఉమ్మడి ఏపీకి చెందుతాయని గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఉన్న నేపథ్యంలో ఆ జలాల ఆధారంగా ప్రతిపాదించిన బనకచర్లకు ఉమ్మడి ఏపీ నుంచి వేరుపడిన తెలంగాణ సమ్మతి తప్పనిసరి. ఈ ప్రాజెక్టు తెలంగాణ హక్కులకు తీవ్ర విఘాతం కలిగించనుంది. బేసిన్‌లో చివరి రాష్ట్రం కావడంతో బనకచర్ల ప్రాజెక్టును చేపట్టే హక్కు ఉందని ఏపీ పేర్కొనడం పూర్తిగా గోదావరి ట్రిబ్యునల్ తీర్పును వక్రీకరించడమే. వరద జలాల పంపిణీ గురించి ట్రిబ్యునల్ తీర్పులో ఎలాంటి ప్రస్తావన లేదు'అని లేఖలో ఆయన పేర్కొన్నారు.

### వరద జలాల పంపిణీకి ప్రాతిపదిక లేదు..

'బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి అక్కడి నుంచి పెన్నా బేసిన్‌లోని రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తరలించాలని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టు

(మిగతా 2వ పేజీలో)



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

కేటీఆర్‌కు ఎర్రవల్లిలో కేసీఆర్ దంపతుల ఆశీస్సులు

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు పోటెత్తారు. సమావేశ మందిరంలో జరిగిన వేడుకల్లో కేటీఆర్ భారీ కేక్‌ను కట్ చేశారు. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు దేవీ ప్రసాద్, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు కేటీఆర్‌కు

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే

శుక్రవారం,
జూలై 25, 2025

# పార్లమెంట్‌లో రచ్చరచ్చ

**బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై విపక్షాల ఆగ్రహం**

**వెంటనే చర్చ చేపట్టాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్**

**యథావిధిగా కొనసాగిన నిరసనలు, నినాదాలు**

**ఉభయ సభలు పలుమార్లు వాయిదా**



న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వరుసగా నాలుగో రోజు గురువారం ఎలాంటి కార్యకలాపాలు చోటుచేసుకోలేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతోపాటు కీలక అంశాలపై విపక్షాలు తమ డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయా అంశాలపై వెంటనే చర్చ ప్రారంభించాలని, ప్రభుత్వం స్పందించాలని తేల్చిచెప్పాయి. నిరసనలు, నినాదాలు యథావిధిగా కొనసాగించాయి. ఉభయ సభలకు అంతరాయం కలిగించాయి. దీంతో సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శించారు. సభకు సహకరించాలని, వెనక్కి వెళ్లి సీట్లలో కూర్చోవాలని స్పీకర్ బిర్లా కోరినా వారు వినిపించుకోలేదు. సభకు అంతరాయం సరైన పద్ధతి కాదని స్పీకర్ హితవు పలికారు. సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత పరిస్థితిలో మార్పు రాలేదు. గోవా అసెంబ్లీలో ఎస్టీలకు సీట్ల కేటాయింపునకు సంబంధించిన బిల్లుపై చర్చలో పాల్గొనాలని స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేయగా, విపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. ఎస్టీలకు సంబంధించిన బిల్లుపై చర్చకు అడ్డుపడడం పట్ల విపక్షాలపై న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినప్పటికీ నినాదాలు ఆగకపోవడంతో సభాపతి లోక్‌సభను శుక్రవారానికి వాయిదావేశారు.

### రాజ్యసభలోనూ గందరగోళం

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభలో విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఉదయం రాజ్యసభ సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే వారు అలజడి సృష్టించడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత క్యారేజీ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లుపై చర్చ మొదలైంది. దీనిపై ఏఐఏడీఎంకే నేత తంబిదురై మాట్లాడారు. ఇంతలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి చేరుకొని నినాదాలతో హోరెత్తించారు. తంబిదురై తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఆయోధ్యరామిరెడ్డి మాట్లాడారు. విపక్ష ఎంపీలు తమ నినాదాలు ఆపలేదు. సభలో వారి ప్రవర్తన పట్ల బీజేపీ ఎంపీ లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని సభాపతి స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలితాను కోరారు. ప్రతిపక్ష నేత ఖర్గేకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ విన్నవించారు. అందుకు సభాపతి అంగీకరింకపోవడంతో విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దాంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి పేర్కొన్నారు.

### పార్లమెంట్‌లో ప్రాంగణంలో నిరసన

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఓటు బందీని ఆపాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విపక్షాలు ప్రదర్శించిన ప్లకార్డుల్లో లోక్‌తంత్ర బదులు లోక్‌తంతర్ అని రాసి ఉండడంతో బీజేపీఈ నేత మాలవీయా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఏది ఎలా రాయాలో తెలియనివారు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

## ఈ నెల 26 నుంచి సింగపూర్‌లో సీఎం చంద్రబాబు పర్యటన

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సీఎం పారిశ్రామిక వేత్తలను కోరనున్నారు. ఏపీలో పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమీ కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడులపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ ఏడాది నవంబరులో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సింగపూర్ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు గానూ ఆ దేశానికి చెందిన ప్రముఖులతోనూ ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్‌టెక్‌పై నిర్వహించే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే సింగపూర్‌లో నిర్వహించే బిజినెస్ రోడ్ షోకు హాజరవుతారు. ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను కూడా సీఎం సందర్శించనున్నారు.

## కేంద్రం వద్దకు ఆర్డినెన్స్ ముసాయిదా!

42 శాతం రిజర్వేషన్ల బిల్లు సైతం కేంద్రానికి వెళ్లగా..దీనిపై 30 నుంచి 32 అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కేంద్రం తిరిగి రాష్ట్రానికి పంపించినట్లు కూడా తెలిసింది. కాగా ఆర్డినెన్స్ ముసాయిదాను కేంద్ర హోం శాఖకు పంపిన అంశంపై రాజ్‌భవన్ వర్గాలు స్పందించడం లేదు. ప్రస్తుత పరిమితి 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు చేయడానికి ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రానికి హక్కు ఉన్నట్లుగా ముసాయిదాలో పేర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో పీఆర్ చట్టానికి సవరణల వరకే ప్రతిపాదించారా? 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు జరుగుతుందా? ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎంతవరకు అవకాశం ఉందన్నది చర్చనీయాంశమౌతోంది.

### ఢిల్లీ స్థాయిలో చర్చ..

ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు సాగుతున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపుదల వంటి వాటిపైఢిల్లీ స్థాయిలో చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరంగా తాము చేపట్టిన చర్యలు, తీసుకున్న నిర్ణయాలను గురించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు.. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక, కాంగ్రెస్ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పంపిన ముసాయిదా ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ చట్టంలో 50 శాతానికి లోబడి రిజర్వేషన్లు ఉండాలనే క్లాజ్ సవరణ విషయంలో ఎలాంటి వైఖరిని అనుసరించాలనే దానిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సలహాను గవర్నర్ కోరినట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో చట్ట, న్యాయపరంగా ఎదురయ్యే సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలా ముందుకు వెళ్లాలి తదితర అంశాలపై ఆయన స్పష్టత కోరినట్టు తెలుస్తోంది.

# బనకచర్లకు మా సమ్మతి తప్పనిసరి



గోదావరి బేసిన్ పరిధిలోకి రాదు. పూర్తిగా కృష్ణా, పెన్నా బేసిన్ల పరిధిలోకి ఆయకట్టు రానుండటం వల్ల ఈ అంశంపై పునఃపరిశీలన జరపాలి. రాష్ట్రాల మధ్య వరద జలాల పంపిణీపై గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఎలాంటి నిబంధన లేదు. భారీ మొత్తంలో జలాలను బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ తరలించడంతో ఇప్పటికే కృష్ణా బేసిన్ తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోంది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించడం పూర్తిగా కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పునకు విరుద్ధం'అని లేఖలో తెలంగాణ పేర్కొంది. విభజన చట్టంలోని సెక్షన్లు 84 (3) (2), 85 (8సీ/8డీ) ప్రకారం కొత్త ప్రాజెక్టులన్నింటికీ తొలుత సంబంధిత నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా బనకచర్ల విషయంలో ఏపీ ఈ నిబంధనలన్నింటినీ ఉల్లంఘించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపిందని వివరించింది. బనకచర్లతో పోలవరం గేట్ల నిర్వహణలో మార్పులు జరిగి బ్యాక్‌వాటర్‌తో తెలంగాణ భూభాగంలో ముంపు సమస్య మరింత తీవ్రమై దుమ్ముగూడెం బరాజ్ మునుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాక్‌వాటర్ మరింత పెరిగితే భద్రాచలం పట్టణం, ఆలయంతోపాటు పరిసర గ్రామాలు, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ముంపునకు గురవుతాయని పేర్కొంది.

### పోలవరంపై పీపీఏకే ఆ అధికారం..

బనకచర్లలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఫోర్‌షోర్ నుంచి నీటిని తరలించనుండటంతో ఆ పనులు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) పరిధిలోకి వస్తాయని తెలంగాణ తెలిపింది. విభజన చట్టం ప్రకారం ఏర్పాటైన పీపీఏ.. పోలవరం పనులను టీఏసీ, సీడబ్ల్యూసీ అనుమతులకు కట్టుబడి నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది. టీఏసీ, సీడబ్ల్యూసీ అనుమతుల్లేకుండా బనకచర్ల పేరుతో పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులను పీపీఏ అనుమతించరాదని కేంద్రాన్ని తెలంగాణ కోరింది. బనకచర్లకు పర్యావరణ, ఇతర అనుమతులను కోరే అధికారం పీపీఏకే ఉందని స్పష్టం చేసింది. పోలవరం ద్వారా 449.78 టీఎంసీల తరలింపునకు డీపీఆర్ రూపొందగా... తాజాగా మరో 200 టీఎంసీలను ఇదే ప్రాజెక్టు ద్వారా తరలించడానికి బనకచర్లను ఏపీ ప్రతిపాదించడం వల్ల పోలవరం ద్వారా తరలించనున్న మొత్తం జలాలు 650 టీఎంసీలకు పెరిగి ప్రాజెక్టు అపరేషన్ షెడ్యూళ్లలో మార్పులు చోటుచేసుకుంటాయని లేఖలో తెలంగాణ వాదించింది. ఇది ఉమ్మడి ఏపీ, మధ్యప్రదేశ్, ఒడిశాల మధ్య కుదిరిన ఆపరేషన్ షెడ్యూల్ ఒప్పందానికి విరుద్ధమని గుర్తుచేసింది. 75 శాతం లభ్యతతో 449.78 టీఎంసీల తరలింపునకే పోలవరానికి సీడబ్ల్యూసీ అనుమతించగా.. బనకచర్ల పేరుతో అంతకుమించి మిగులు జలాలను ఏపీ తరలించాలనుకోవడం ఆ అనుమతులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా అదనపు పనులు చేపట్టడంతో 2011లో పనుల నిలుపుదలకు కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలు జారీ చేసిందని.. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో పార్టీ కేడర్ మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న కేటీఆర్.. అనంతరం సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలసి ఎర్రవల్లి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు కేసీఆర్, శోభ పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కేటీఆర్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమారుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఎ స్మైల్'పేరిట రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, కేటీఆర్ అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ సహకారంతో ఓ ప్రైవేటు పాఠశాలకు బెంచీలు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల చికిత్స కోసం 'తలసేమియా సికిల్‌సెల్ ఎనీమియా సొసైటీ'కి కేటీఆర్ చేతుల మీదుగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి రూ.3 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. అలాగే కేటీఆర్ పటాన్‌చెరుకు వెళ్లి ఇటీవల అరెస్టయిన పార్టీ సోషల్ మీడియా విభాగం కార్యకర్త నల్లబాలు అలియాస్ శశిధర్‌గౌడ్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఆయన పోస్టు పెట్టడంతో అరెస్టయిన విషయం తెలిసిందే. నల్లబాలు నివాసంలో ఆయన కుటుంబ సభ్యుల మధ్య కేటీఆర్ కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుక చేసుకున్నారు. అనంతరం వారి ఇంట్లో భోజనం చేశారు.

# పార్లమెంటులో పోరాడండి

ప్రకటించుకున్నారు. ఇది తెలంగాణలో సరికొత్త పరిణామం. వీరంతా ఎవరని.. సర్వే, స్వతంత్ర నిపుణుల బృందాలు పరిశీలించాయి. వాళ్లంతా ఇంగ్లీష్ అభ్యసించిన ఉన్నత విద్యావంతులని తేలింది. ఈ సర్వే ప్రకారమే మేము బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాం..' ముఖ్యమంత్రి తెలిపారు. 'బీజేపీ తొలి నుంచి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ. మేము కుల గణన చేపట్టబోమని రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటులో చెప్పారు. రైతుల నల్ల చట్టాల విషయంలో రాహుల్ గాంధీ గళం విప్పిన తర్వాత మోదీ వాటిని రద్దు చేసి క్షమాపణ చెప్పారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ మాట మేరకు తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాత కేంద్రం కుల గణనకు అంగీకరించింది. ఇదంతా రాహుల్ గాంధీ ఘనతే. మేము చేపట్టిన సర్వే దేశానికి రోల్ మోడల్. ఇది తెలంగాణ మోడల్. నేను దీనిని 'రేర్' (ఆర్ఏఆర్ఈ) మోడల్ అంటున్నా. ఆర్ఏఆర్ఈ..అంటే ఏమిటో నేను త్వరలో వివరిస్తా..' అని రేవంత్ అన్నారు.

### సోనియాగాంధీ లేఖ నాకు నోబెల్, ఆస్కార్ లాంటిది

'కుల సర్వే, బీసీ బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సోనియాగాంధీ స్వహస్తాలతో నాకు లేఖ రాశారు. ఆ లేఖ నాకు నోబెల్, ఆస్కార్, జీవితకాల సాఫల్య పురస్కారాలతో సమానం. నేను ఈ స్థానంలో ఉన్నా లేకున్నా ఆ లేఖ నాకు ప్రత్యేకంగా మిగిలిపోతుంది..' అంటూ సీఎం భావోద్వేగానికి గురయ్యారు.

### డిప్యూటీ సీఎం భట్టి పవర్‌పాయింట్ ప్రజంటేషన్

బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ప్రసంగించారు. మహేశ్‌గౌడ్ కార్యక్రమ సంధానకర్తగా వ్యవహరించారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఖర్గే, రాహుల్‌తో సీఎం బృందం భేటీ

గురువారం ఉదయం ఖర్గే నివాసంలో ఆయనతో పాటు, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో కులగణన సర్వే ప్రక్రియ, శాసనసభలో బిల్లుల ఆమోదం, పార్లమెంట్‌లో వాటిని ఆమోదింప జేయడంపై చర్చించారు.

# రాష్ట్రానికి రెండ్రోజులు ఎల్లో అలర్ట్

**మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ**


**ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని అంచనా**

**కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటున 2.53 సెం. మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతంలో గురువారం ఉదయం ఉపరితల ఆవర్తనం విలీనమైంది. దీంతో వచ్చే రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదవుతాయని తెలిపింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30%–%40 కి.మీ. వేగంతో కూడిన ఈదురుగాలులతో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది. ఈ మేరకు రెండు రోజులపాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3%–%6 డిగ్రీల సెల్సియస్ మేర తక్కువగా నమోదవుతున్నాయి. గురువారం నల్లగొండలో 28.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

### అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి: సీఎం

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం... గురువారం సీఎంఓ అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలు నమోదైన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వరద ఉధృతి ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షసూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని.. ప్రతి విభాగం అధికారితో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలని చెప్పారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు అవసరమైన సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని.. జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉండాలన్నారు




# నేటినుంచి దోస్త్ ప్రత్యేక రౌండ్

**స్థానికేతరులకు కూడా స్పాట్ ప్రవేశాలు**

**ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం నుంచి మొదలు పెడతారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని దోస్త్ కమిటీ గురువారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రూ.400 రుసుముతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 25 నుంచి 31 వరకూ వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 31న ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు. వచ్చే నెల 3వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. వచ్చే నెల 6వ తేదీలోగా సీట్లు వచ్చిన విద్యార్థులు రిపోర్టింగ్ చేయాలి. ఇంకా సీట్లు మిగిలిపోతే వచ్చే నెల 11, 12 తేదీల్లో కాలేజీల్లో స్పాట్ ప్రవేశాలను నిర్వహిస్తారు. స్పాట్‌లో సీటు పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పొందే అర్హత ఉండదు. స్పాట్ ప్రవేశాల్లో నాన్ లోకల్ విద్యార్థులు కూడా సీట్లు పొందే అవకాశం కల్పించారు. ఈసారి కౌన్సెలింగ్‌లో ఎర్త్ యూనివర్సిటీ కోర్సులను కూడా అందుబాటులోకి తెచ్చారు





# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

వాయిస్ టుడే న్యూస్, జులై 24 మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయలలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ఆధ్వర్యంలో మరియు పిర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలతో జరుపుకున్నారు.



## బోనాల పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

వాయిస్ టుడే న్యూస్, జులై 24 మేడిపల్లి : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల చెంగిచెర్లలో ఆదివారం బోనాల పండగ సందర్భంగా ఆలయ చైర్మన్లు, ఆర్గనైశర్ల తో సమావేశం జరిగింది. శాంతియుతంగా బోనాల పండగను జరుపుకోవాలని చెప్పడం మరియు ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తెలియజేయడం, అదేవిదంగా ఫలహారం బండ్లు మరియు తోట్టల తీసేవాళ్ళు ముందుగా పోలీస్ స్టేషన్ కు తెలియపరిస్తే తగిన బందోబస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని మేడిపల్లి సీఐ.గోవింద్ రెడ్డి తెలిపారు.



## గుమ్మడిదల రైతు వేదికలో సాగు మెలకులపై సదస్సు నిర్వహించిన మండల వ్యవసాయ శాఖ అధికారులు

జిన్నారం జులై 24 (వాయిస్ టుడే ): సంగారెడ్డి జిల్లా గుమ్మడిద మండలం రైతు వేదికలలో గురువారం రోజు శ్రీనివాసరావు పలు పంటల పైన సాగులోని మేలుకోలపైన సదస్సు నిర్వహించి ఆయిల్ పామ్ సాగు మరియు ప్రభుత్వం అందించే సబ్సిడీలు వానాకాలం 2025 పంటల సాగు పద్ధతులు, ఎరువుల వాడకం లో మెళుకువలు నానో యూరియా డి ఏ పి వాడకం పైన అవగాహన స్థానిక రైతుల కోసం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించడానికి సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పలు అంశాలపై చర్చ జరిగింది ఆయిల్ పామ్ సాగు ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యత మరియు దీర్ఘకాలిక లాభాలు మన ప్రాంతానికి అనువైన సాగు పద్ధతులు మార్కెట్ డిమాండ్ మరియు ఆదాయ అవకాశాలు ప్రభుత్వ సబ్సిడీలు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆయిల్ పామ్ సాగు సబ్సిడీల వివరాలు అర్హత, దరఖాస్తు ప్రక్రియపై మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (MIDH) క్రింద ఉన్న ప్రోత్సాహక పథకాల కూరగాయల నారు సబ్సిడి పైన రైతులకి అందజేయడం పైన వివరాలు ప్రస్తుతం వరి నారు మళ్లలో తీసుకోవలసిన జాగ్రత్తలు మొక్కజొన్న మరియూ పత్తి పంటలలో సస్యరక్షణ, ఎరువుల వాడకం మరియూ నానో యూరియా మరియు డి ఏ పి ఉపయోగాలు వివరించారు. రైతులు ఆయిల్ పామ్ పథకంలో నమోదు చేసుకోవాలని, ఉద్యానవన శాఖ ద్వారా అందుతున్న పథకాలను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. అదేవిధంగా రైతు రిజిస్ట్రేషన్ ఆవశ్యకత గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి డి శ్రీనివాస్ రావు మరియు ఏఈవోలు అనూష రెడ్డి నికిత రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## డంప్ యార్డ్ తరలించడానికి చర్యలు తీసుకోండి

### బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి డిమాండ్



జిన్నారం జులై 24 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలో గత కొన్నేళ్లుగా డంప్ యార్డ్ పై పిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంతో గురువారం స్థానికులతో కలిసి బొల్లారం మున్సిపల్ బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి చెత్త తరలించే వాహనాలను అడ్డుకున్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్ లో శ్మశాన వాటిక సమీపంలో ఉన్న డంప్ యార్డ్ కారణంగా దుర్వాసన వస్తుందని, ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు మున్సిపల్ అధికారులకు పిర్యాదులు చేసారు. అధికారులు బదిలీలు జరిగి కొత్త అధికారులు వస్తున్నారు తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆరోపించారు. బుధవారం చెత్త తరలించే వాహనాలను అడ్డుకోవడంతో మున్సిపల్ కమిషనర్ కిషన్ అక్కడకు చేరుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై స్థానికులతో పాటు బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి సమస్యలపై కమీషనర్ కు వివరించారు. సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం స్థానికులతో కలిసి బొల్లారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మరోసారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు.

## గుమ్మడిదలలో గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

జిన్నారం జులై 24 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సిజిఆర్ కార్యాలయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వం రాష్ట్రానికి విశేషమైన ప్రగతిని తీసుకువచ్చిందని ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి, యువత ఆకాంక్షలకు న్యాయం చేయడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. కేటీఆర్ లాంటి ప్రజానేత జన్మదినాన్ని జరపడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ లు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ దోమడుగుశంకర్, శ్రీనివాస్, నాయకులు దేవేందర్ రెడ్డి, మొగులయ్య, మంద భాస్కర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, వినోద్, గోపాల్, రమేష్, చంద్రశేఖర్, సంజీవరెడ్డి, ఆంజనేయులు యాదవ్, యాదిరెడ్డి, గోపాల్, మహేష్, ప్రవీణ్ రెడ్డి, మల్లేష్, పద్మారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, భార్గవ్ చారి,పలువురు మాజీప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పాల్గొన్నారు.



## కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా శిష్యు విహార్‌లో వీణా వాణితో కలిసి కటింగ్ కార్యక్రమం నిర్వహించిన మాగంటి వజ్రనాథ్

జూబ్లీహిల్స్, 24 జులై (వాయిస్ టుడే): వెంగల్ రావు నగర్ లో ఉన్న శిశు విహార్ గురువారం స్వర్గీయ మాగంటి ఎమ్మెల్యే గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ , శిశు విహార్ లోగల అనాధ పిల్లలకు బుక్స్ పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వీణ వాణి కవల పిల్లలకు పండ్లు పుస్తకాలు పంపిణీ చేశారు.. వజ్రనాథ్ వీణ వాణి తో మాట్లాడుతూ మీకు ఏ సమస్య ఉన్నా నేను మీకు ఉంటానని హామీ ఇచ్చారు.. అనంతరం శిశు విహార్ అధికారులతో మాట్లాడి అనాధ పిల్లలకు చేస్తున్న సేవలు గురించి తెలుసుకొని, అనాధ పిల్లలకు తన వంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని ,ఎలాంటి అవసరం ఉన్నా నాకు తెలియపరచాలని మాగంటి వజ్రనాథ్ అధికారులకు సూచించారు.

## తెలంగాణ ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సుద్దాల సురేష్



నాచారం జూలై 24(వాయిస్ టుడే): గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఆర్టీసి కార్మికుల సమస్యలను నేడు జరుగబోయే క్యాబినెట్ సమావేశంలో వెంటనే పరిష్కరించాలనీ తెలంగాణ ఆర్టీసి బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ సీఎం రేవంత్రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం వినతి పత్రాన్ని సీఎం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల నుంచి హామీల అమలు కోసం 40 వేల ఆర్టీసి కార్మికుల కుటుంభాలు వేచి చూస్తున్నాయన్నారు. సీఎం రేవంత్రెడ్డి అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకాన్ని ఆర్టీసి కార్మికులందరం భుజస్కంధాలపై పెట్టుకుని విజయవంతం చేశామన్నారు. మీరు అందిస్తున్న ప్రజాపానలతో ఆర్టీసి కార్మికులను సైతం ప్రజలుగానే పరిగణించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు ఆర్టీసిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు.



## కేటీర్ జన్మదిన వేడుకలు నిర్వహించిన జిన్నారం బి.ఆర్.స్ నాయకులు కార్యకర్తలు

జిన్నారం జులై 24 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలో గురువారం రోజు బి ఆర్ స్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ మంత్రి వర్యులు కల్వకుంట తారక రామారావు జన్మదినం సందర్భంగా జిన్నారం మండలం మాదారం గ్రామంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిదిగా రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , సురేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్, శివరాజ్, ఆంజనేయులు, నరేందర్, జనార్దన్, ప్రభాకర్ రెడ్డి, భార్గవ్, సత్యనారాయణ, రవీందర్ ,మోహన్, గణేష్, రామకృష్ణ, ఆంజనేయులు, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,రాజు,సతీష్, ఆంజనేయులు,కదీర్,బిక్షపతి, శ్రీనివాస్, రమేష్,నర్సింగ్ రావు, విష్ణు, మల్లేష్, మహేందర్, రాజు గౌడ్, భవాని సింగ్, శ్రీను, నిఖిల్, గణేష్ ,బాలేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.




## నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్..

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. వృధా అవుతున్న ప్రజా ధనం

శేరిలింగంపల్లి, జులై 24(వాయిస్ టుడే): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రజల సౌకర్యార్థం నిర్మించిన అనేక పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. సిబ్బంది పర్యవేక్షణ కొరవడటం, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల ఇవి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా భారతి నగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎం.ఐ.జి కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణ లేమితో పూర్తిగా నిరుపయోగంగా మారాయి. లోపల చెత్తాచెదారం పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతుండటంతో వాటిని ఉపయోగించే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజలకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ టాయిలెట్లు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యర్థాలుగా మారాయి. పరిశుభ్రత లోపించడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇది పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా హానికరం. స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై దృష్టి సారించాలని, వాటిని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ఈ వసతులను సక్రమంగా వినియోగంలోకి తీసుకురావడం ద్వారా నగర పరిశుభ్రతను, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## అపార్ట్మెంట్ ఐదవ అంతస్థు నుండి దూకి పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

### మియాపూర్ పీయస్ పరిధిలో ఘటన



శేరిలింగంపల్లి, జూలై 24(వాయిస్ టుడే): వివిధ రకాల కారణాలతో తీవ్ర ఒత్తిడికి గురై..డిప్రెషన్‌లోకి వెళ్లిన కొందరు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి పరిస్థితి మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ జనప్రియనగర్ కాలనీలో నివాసం ఉంటున్న హన్సిక (15 ) మాధవనగర్ లోని సెయింట్ మార్టిన్ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. గురువారం మధ్యాహ్నం సమయంలో తాను నివాసం ఉంటున్న అపార్ట్మెంట్ ఐదవ అంతస్థు పై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తలకు,శరీర భాగాలకు తీవ్ర గాయాలు అవ్వడం తో వెంటనే దగ్గరలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గత శనివారం అదే పాఠశాకి చెందిన 10వ తరగతి విద్యార్థి రిజ్వాన్ పాఠశాల భవనం పైనుండి దూకి మరణించిన విషయం తెలిసిందే. అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని హన్సిక ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం స్థానికంగా తీవ్ర చర్చనీయంగా మారింది. ఐదు రోజుల వ్యవధిలో ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు పదవ తరగతి విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



## గుమ్మడిదల మండల పరిధిలోని పలు పాఠశాలను పరిశీలించిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

జిన్నారం జులై 24 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని గురువారం రోజు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు గుమ్మడిదల మండలం నందు వివిధ పాఠశాలలను సందర్శించారు దీంట్లో భాగంగా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని జడ్.పి.హెచ్.ఎస్ బొంతపల్లి నందు జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశాన్ని పర్యవేక్షించారు అదేవిధంగా జడ్.పి.హెచ్.ఎస్ బొంతపల్లి పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై ఎఫ్ ఆర్ ఎస్, ఎల్ఐపి మొదలగు వాటిపై చర్చించారు అనంతరము జడ్.పి.హెచ్.ఎస్ దోమడుగు సందర్శించి ఆ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు వారితో పాటు గుమ్మడిదల ఎంఈఓ కూడా ఉన్నారు.

# గుల్ మొహర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీకు వినతి

## సానుకూలంగా స్పందించిన గాంధీ

శేరిలింగంపల్లి,జూలై 24(వాయిస్ టుడే): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్ మెహర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులు త్వరగా పరిష్కరించాలని గుల్ మొహర్ కాలనీ వాసులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి వివేకానంద నగర్ లోని అయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.దీనిపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా గుల్ మెహర్ కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీ లో మౌలిక వసతులు కలిపించినదుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని,నల్లగండ్ల చౌరస్తా ను విస్తరించాలని,అదేవిధంగా కాలనీల లో అంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చలని, అవసరమున్న చోట యూజీడీ పైప్ లైన్లు వేయాలని,విధి దీపాలను ఏర్పాటు చేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ కి వినతి పత్రం ద్వారా కోరారు.

అనంతరం పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ త్వరలోనే గుల్ మెహర్ కాలనీ లో పర్యటిస్తానని,గుల్ మోహర్ కాలనీ లో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, డ్రైనేజి



సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. త్వరలనే అవసరమున్న చోట రోడ్లను మరియు యూజీడీ పైప్ లైన్ లు ఏర్పాటు చేస్తామని, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తామని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని పనులను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ హామీఇచ్చారు.ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నల్లగండ్ల చౌరస్తా విస్తరణ పనులు చేపడుతామని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.కాలనీ లో అవసరమున్న చోట విధి దీపాలను ఏర్పాటు చేస్తామని, విధి దీపాలను సక్రమంగా వెలిగేలా చూడలని అధికారులతో చర్చించారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని,ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని పీఏసీ చైర్మన్ గాంధీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ కే.బీ. వీ. సుబ్బారావు, గుల్ మెహర్ కాలనీ ప్రెసిడెంట్ షేక్ ఖాసీం,జనరల్ సెక్రెటరీ ఆనంద్ కుమార్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ విల్సన్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ..

### కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణి చేసిన తిరుమలేష్

శేరిలింగంపల్లి, జూలై 24(వాయిస్ టుడే): గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గుర్ల తిరుమలేష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ.. నిరుపేదలే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతారని,ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలన్నదే మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ప్రతి ఒక్కరికి సహాయం చేయాలని గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమానికి కేటీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎన్నో కుటుంబాలకు కేటీఆర్ సహాయం చేశారని, కేటీఆర్ అభిమానిగా ఉద్యమకారుడుగా చాలా కాలంగా ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. రాబోయే ఎన్నికలలో బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేటీఆర్ బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం బి.ఆర్.ఎస్ పార్టీతోనే సుభిక్షంగా ఉంటుందని, రాబోయే రోజుల్లో ప్రజలకు మంచి రోజులు వస్తాయని వ్యాఖ్యనించారు. అనంతరం కేటీఆర్ కు తిరుమలేష్ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల నరసింహారెడ్డి, రాపోలు రాజశేఖర్, మార్తా, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు

నాచారం జూలై 24(వాయిస్ టుడే):నాచారం డివిజన్లో గ్రేటర్ బారసా నాయకులు సాయిజన్ శేఖర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై డివిజన్లోని సుమారు 100 మంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కేటీఆర్ పుట్టినరోజు కేకును ఎమ్మెల్యే కట్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు విఠల్ యాదవ్,ముత్యం రెడ్డి,శ్రీనివాస్ యాదవ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చిల్కానగర్లో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు


### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి కార్పొరేటర్ బన్నాల

### హ్యాపీ బర్డే కేటీఆర్, లాంగ్ లీవ్ లాంగ్ లీవ్ కేటీఆర్ లాంగ్ లీవ్

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వహక అధ్యక్షులు కేటిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,మాజీ హోం మంత్రి వర్యులు ముఖ్య అతిథులుగా విచ్చేసి చిలకానగర్ డివిజన్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. అనంతరం నినాదాలతో హ్యాపీ బర్డే కేటీఆర్, లాంగ్ లీవ్ కేటీఆర్ అంటూ స్వీట్లు పంచుకొని ఇలాంటి బర్డేలు కేటీఆర్ మరెన్నో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుల బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, రామాంజనేయులు, బాలకృష్ణ, గౌడ్ యాదగిరి, పోచయ్య, ఎండి మహమూద్, ఎండి షఫీ, శ్యామ్, బాలు, బంటి గౌడ్, సాయి గౌడ్ పాల్గొన్నారు.

## బాగా దారి న్యాయ సమ్మేళనం విజయవంతం చేయాలి

### ఢిల్లీ బీసీ సదస్సు బయలుదేరిన పోత్నక్ ప్రమోద్ కుమార్



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- రేపు 25వ తేదీన ఢిల్లీలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబిసి డిపార్ట్మెంట్ "బాగాదారి న్యాయ సమ్మేళన్" కార్యక్రమంకు ఢిల్లీకి బయలుదేరిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో జై బాబు జై భీమ్ జై సమ్మిదాన్ కోఆర్డినేటర్ కొత్తగూడెం భద్రాచలం జిల్లా అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ బృందం భారత్ జోడోయాత్ర చేపట్టి దేశంలో అన్ని కులాలు అన్ని మతాలు అన్నగారిన వర్గాలు ప్రజలందరూ బాగాదారి న్యాయ సమ్మేళనం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై బీసీలకు జనాభా ఎంత భాగస్వామ్యం అంత రిజర్వేషన్లు ఉద్యోగ విద్య రాజకీయాలలో భాగస్వామ్యం కల్పించాలని దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని నరేంద్ర మోడీ పైన ప్రజాస్వామ్య రీతిలో రాహుల్ గాంధీ చేపట్టిన రేపు జరిగే తల్ కటోర స్టేడియంలో సభకు తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో పడిగెల ప్రదీప్ సురేందర్ బిక్షం రామలింగం యాదవ్ శ్రీనివాస్ నేత వెళ్లారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

### ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- సీనియర్ కాంగ్రెస్ నాయకులు- హెచ్ బి కాలనీ డివిజన్అధ్యక్షులు పొలిపాక అంజయ్య జన్మదినోత్సవ వేడుకలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై..ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..ముందుగా అంజయ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంజయ్య పార్టీ పటిష్టతకు నిర్విరామంగా కృషి చేశారాని, తన జన్మదిన సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం విద్య పై తనకు ఉన్న మక్కువను ప్రతిబింభిస్తుందని పేర్కొన్నారు. రేవంతన్న సర్కార్ విద్యావ్యస్థలో విప్లవాత్మక మార్పులు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత విద్యను అభ్యసించి బాధ్యత గల పౌరులుగా తమ పాఠశాలకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్,నవీన్ ,జెమినీ, వేణు, యాదగిరి,రాజు,ఉదయ్ కిరణ్, మల్లేష్,సుజాత,నవీన్, కిషోర్,నిక్కీ,రజిత,జ్యోతి, సురేషగౌడ్,హర్ష రెడ్డి,సుబ్బు, యాకుబ్,సమయ్య, కిషోర్ ,కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

## నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నాగోల్‌లో ఘనంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు

### కుటుంబ సమేతంగా హాజరైన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్



హైదరాబాద్ : జూలై 24 ( వాయిస్ టూ డే): నాగోల్ లో కంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) బోనాలు గౌడ కులస్తులచే నవ చైతన్య యువజన సంఘం, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు ఇంటి నుంచి బోనాలు తీసుకొచ్చి బోనాలు సమర్పించారు, ఈ కార్యక్రమానికి తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు(నాగోల్ గ్రామ కమిటీ అధ్యక్షులు) బద్దం ధనుంజయ్ గౌడ్, యువ వ్యాపారవేత్త బద్దం నిఖిల్ గౌడ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పులు, యువత ఆటపాటలతో నాగోల్ గ్రామం పురవీధుల గుండా గౌడ కులస్తుల మహిళలు నెత్తిన బోనం పెట్టుకొని ఆలయానికి తరలివచ్చారు దీంతో ఆలయం కిటకిటలాడింది ప్రధాన చౌరస్తా నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నవ చైతన్య యువజన సంఘం కమిటీ నాయకులు, రామాలయ కమిటీ నాయకులు, పోచమ్మ ఆలయ కమిటీ నాయకులు, మహంకాళి పోచమ్మ మరియు మైసమ్మ దేవస్థానం కమిటీ నాగోల్ గ్రామ కమిటీ సభ్యులు సభ్యులు, నాగోల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంది

### మీడియా అకాడమీకి అన్ని విధాలుగా మద్దతు ఇస్తాం..

### సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక.

హైదరాబాద్, జూలై 24(వాయిస్ టుడే): ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయడానికి జర్నలిజం వారధి అని, రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక అన్నారు. గురువారం నాంపల్లి మీడియా అకాడమీలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టుల ప్రయోజనం కోసం అవసరమైన సౌకర్యాలను అందించడంలో మీడియా అకాడమీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని, అకాడమీకి అన్ని విధాలుగా మద్దతు ఇస్తామని ఆమె అన్నారు. పాత రోజుల్లో వార్తలను అందించే పద్ధతి చాలా కష్టంగా ఉండేదని, కానీ ఇప్పుడు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా వార్తల సమాచారం అందరికీ సెకన్లలో చేరుతుందని ఆమె అన్నారు. ఎప్పటికప్పుడు సమాజం లో జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదని ఆమె అన్నారు. ఈ సమాజంలో ఏమి జరిగిందో ప్రజలకు నిజంగా నిక్కచ్చితంగా, నిజాయితీగా తెలియజేయాలని, మీరు అందించే సమాచారం ఆధారంగానే ప్రజలు విషయాలు తెలుసుకుంటారని ఆమె అన్నారు.

అకాడమీ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ అందించడం, వారికి సహాయం చేయడం వల్ల చాలా మంది పిల్లల చదువుకు గొప్ప ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని, వారికి సంబంధించిన బీమా పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది సక్రమంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. విధుల్లో ఉండి ప్రమాదాల్లో గాయపడి పని చేయలేని వారికి ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రభుత్వం అనేక ఇతర సంక్షేమ పథకాలను అందిస్తుందని, ప్రభుత్వం తన శాఖ ద్వారా జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుందని ఆమె అన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఈ సమావేశాన్ని నిర్వహించిన మీడియా



అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల ప్రమాదాలకు గురై పని చేయలేని 180 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అదేవిధంగా, మరణించిన వారి కుటుంబ సభ్యులకు అకాడమీ రూ. 3 వేల పెన్షన్ అందిస్తుందని చెప్పారు. వారి పిల్లలకు ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు చదువుకు అవసరమైన ఫీజులను అకాడమీ చెల్లిస్తుందని ఆయన అన్నారు. ఈ అకాడమీ ద్వారా ఎడిటర్లు, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు, 4 జిల్లాల్లో శిక్షణ తరగతులు , సెమినార్ లు నిర్వహించామని అన్నారు. నిర్వహిస్తున్నారు. మరో మూడు రోజుల్లో, నైపుణ్యం కలిగిన జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వడానికి మరికొన్ని జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ రోజు ప్రసంగాలలో దిశ ఎడిటర్ మార్కండేయ వార్తలు, కథనాలపై సంక్షిప్త ప్రజెంటేషన్లు ఇచ్చారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద రెడ్డి క్రైమ్ న్యూస్ పై, మరియు 99TV చీఫ్ ఎడిటర్ బాలనారాయణ శిక్షణా తరగతులలో డిజిటల్ మీడియాపై ప్రసంగించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా DRDA పిడి శ్రీలత పాల్గొని DRDA విధానాలను, సెర్ఫ్ ద్వారా మహిళలకు అందించే వడ్డీ లేని రుణాలను వివరించారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ప్రజా సంబంధాల అధికారి పి.సి. వెంకటేశం, TUWJ రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.డి. సలీంపాషా, కార్యదర్శి ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.



## ఓయూలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్, జులై 24 (వాయిస్ టుడే ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేటీఆర్ జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉస్మానియా ఉద్యమ కెరటం, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి, విద్యార్థులకు పుస్తకాలు, గొడుగులు పంపిణీ చేశారు. లాంగ్ లైవ్ కేటిఆర్ అంటూ నినాదాలు చేస్తూ కేటీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, కడారి స్వామి, జంగం అవినాష్, యుగంధర్ రెడ్డి, రవితేజ, నవీన్ గౌడ్, శిగా వేంకట్, శశిపాల్, జిల్లా నాగయ్య, మిథున్, అవినాష్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి 41 రోజుల ఉండి ఆదాయం

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆదాయం (రెండు కోట్ల నలభై ఐదు లక్షల నలభై ఎనిమిది వేల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) మిశ్రమ బంగారం 38 గ్రాములు మాత్రమే మిశ్రమ వెండి (రెండు కిలోల 800 గ్రాములు మాత్రమే) అమెరికా 1036 డాలర్లు ఆస్ట్రేలియా 5 డాలర్లు ఇంగ్లాండ్ 45 పౌండ్స్ సౌదీ అరేబి య5 రియల్ సింగపూర్ 10 డాలర్స్ కతర్ 1/2 రియల్ ఒమన్ 500 బైస అరబ్ ఏమి రెట్స్ 70 ధీరమ్స్ శ్రీలంక 500 మలేషియా 23 రింగ్ ట్స్ కెనడా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఉండి లెక్కింపులో ఈవో వెంకట్రావు దేవస్థానం స్టాఫ్ పోలీస్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది. భక్తులు అధిక సంఖ్యలో ఉండి లెక్కింపులో పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపిద్దాం

### ఎన్నికల సన్నాహక కమిటీ ఇంచార్జి లక్ష్మారెడ్డి

కరీంనగర్,జూలై24(వాయిస్ టుడే): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించే విదంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎన్నికల సన్నాహక కమిటీ మండల ఇంచార్జి, కరీంనగర్ వెస్ట్ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు.కొత్తపల్లి గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. గతంలో పనిచేసిన ఎంపీటీసి,సర్పంచ్ ల వైపల్యాలను ఎండగట్టేవిధంగా ప్రతీ గ్రామంలో కార్యకర్తలు పనిచేయాలని అన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. దేశంలో అమలుపరుస్తున్న ప్రతీ సంక్షేమ పథకం గ్రామాల్లో కూడా అమలవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కేవలం బీజేపీకే సాధ్యమని అన్నారు. సరైన సమయంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల పరిపాలన, అభివృద్ధి కుంటుపడిపోతున్నదని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారంటీల పరిస్థితిపై ప్రశ్నించాలని పేర్కొన్నారు.టీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతితో పాటుగా,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ జడ్పిటీసి ఎడ్ల జోగిరెడ్డి,బీజేవైఎం రాష్ట్ర నాయకురాలు చాద అనితా రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,గ్రామాల బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.




## గడువు ముగిసిన మందులు ఇచ్చిన రేనే హాస్పిటల్ ను సీజ్ చేయాలి

### డాక్టర్ పై ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు

కరీంనగర్, జూలై 24(వాయిస్ టుడే): కరీంనగర్ పట్టణంలోనీ ఇందిరానగర్ లోరెనే హాస్పిటల్ లో కాలం చెల్లిన మందులు విక్రయిస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హాస్పిటల్ పై పూర్తి విచారణ చేసి లైసెన్సు రద్దు చేయాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ కుహ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీష్ ఫిర్యాదు చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఇందిరా నగర్ ప్రాంతంలో గల రేనే హాస్పిటల్ వారు గత కొంతకాలంగా ఆసుపత్రిలో వచ్చిన రోగులకు కాలం చెల్లిన మందులతో వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల ఒక మహిళకు అనారోగ్యంతో హాస్పిటల్లో హెల్త్ చెకప్ కోసం వచ్చింది. డాక్టర్ పరిశీలించి మందులు రాయడంతో మందులు తీసుకోవడానికి ఆస్పత్రిలోని మందుల షాపుకు వెళితే మందులు తీసుకోవడం జరిగింది.అందులో ఒక షీట్ లో ఎక్స్పైరీ డేట్ ముగిసిన కూడా అట్టి మందులను రోగికి ఇచ్చారు. ఈ విధంగా రోగులప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆసుపత్రి పై పూర్తిస్థాయిలో విచారణ చేసి లైసెన్సు రద్దు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా సెక్రెటరీ వేముల సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



## అనుకుంటే సాధించలేనిది ఏది లేదు

### గంగాధర కాంప్లెక్స్ మీటింగ్‌లో జిల్లా విద్యాధికారి చైతన్య జైన్

గంగాధర,జూలై 24(వాయిస్ టుడే): కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాధికారి చైతన్య జైన్ ఈరోజు గంగాధర మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ మీటింగ్ కు హాజరయ్యారు. గ్రంధాలయ కమిటీలు, నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించి పలు సూచనలు చేశారు. చదవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నిర్మాణాత్మక వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది అని, చదివే అలవాటును ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థుల్లో పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు. సమాజంలో డిమాండ్ గా ఉన్న ఆంగ్ల మాధ్యమం మీద ఎక్కువగా శ్రద్ధ చూపించాలని, ఆంగ్లం నేర్పిస్తే ప్రపంచాన్ని చుట్టిరావచ్చు అని పిల్లల్లో ప్రేరణ కల్పించారు.విద్యాధికారి ప్రభాకర్ రావ్ మాట్లాడుతూ మండలంలోసుమారు 689 నూతన ప్రవేశాలు పెంపొందించడం శుభసూచకమని,అనుకుంటే సాధించలేనిది ఏది లేదు అని తెలిపారు.పుస్తకాల బరువుపై వారు చేస్తున్న కృషి అభినందనీయం అని, త్వరలో ఆ ప్రయోగ పరిశీలన కోసం రాష్ట్ర స్థాయి బృందం రాబోతుందని వారి కృషిని అభినందించారు. పాఠశాలల్లో గ్రంథాలయ స్థితిగతులపై టీచర్లతో చర్చించి, వెంటనే ఆ దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారని సమాజానికి తెలపడంలో ప్రగతి, మార్కులు, విద్యార్థుల ప్రవర్తన మార్పు, సృజనాత్మకత, భాగస్వామ్యం సూచికలుగా నిలుస్తాయని ఆ దిశగా ఈ విద్యా సంవత్సరం అందరం కలిసి ముందుకు వెళ్దామని అన్నారు. కరీంనగర్ లో ఇప్పటికే మార్పు ప్రారంభం కావడం శుభ సంకేతంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, రిసోర్స్ పర్సన్ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

# మోడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కిట్ కార్పొరేట్స్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### - ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పిలుపు




భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– నాడు దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా నినాదంతో జరిగిన పోరాట స్ఫూర్తితో నేడు మోడీ ప్రభుత్వ అనుకూలమైన కార్పొరేట్స్ కు వ్యతిరేకంగా ఆగస్టు నెలంత దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కిట్ కార్పొరేట్స్ కార్యక్రమంలో పేదలు,వ్యవసాయ కార్మికులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలోని పి.ఆర్.జి ఫంక్షన్ హాల్ లో జరుగుచున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా బి.వెంకట్ పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం చాలా దారుణంగా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చి దేశ సంపదను వారికి దోచిపెట్టే విధంగా కీలకమైన వ్యవసాయ రంగాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు, పేదలు సంపదను దోచుకుంటున్న కార్పొరేట్లను తరిమికొట్టి, వ్యవసాయ రంగాన్ని కాపాడుకొని, గ్రామీణ పేదలను రక్షించుకుందామని వారు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలకు తలోగ్గి మన వ్యవసాయాన్ని దివాళి తీహించాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అమెరికా ట్రంప్ ప్రభుత్వానికి బార్లు తెరిచి వారి యొక్క వ్యవసాయ ఉత్పత్తులను మన దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు మనదేశంలోకి వస్తే ఇక్కడ మన రైతులు పండించే గోధుమలు, మొక్కజొన్న ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కొని నాధుడు ఉండడని దీనివలన మన ఆహార భద్రతకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు దీనిని ప్రజలందరూ తిప్పి కొట్టాలని సూచించారు. మరోపక్క ఆహార భద్రతలో భాగంగా ఇప్పుడు ఇస్తున్న సరుకులను ఇవ్వకుండా నగదు బదిలీని చేయాలని చూస్తున్నాడని దీని ద్వారా అంబానీ అదాని ఆస్తులను మరింత పెంచడానికి మోడీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నడని విమర్శించారు. దేశంలో 25 కోట్ల ఫుడ్ కార్డులు, 85 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని వీరందరికీ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు వస్తే నష్టం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రైతులు, కౌల్ రైతులు దానిమీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని కొలతల ద్వారా కూలీలకు డబ్బులు చెల్లిస్తున్న మోడీ ప్రభుత్వం ఎందుకు రోజుకు రెండుసార్లు పని ప్రదేశంలో కూలీలను ఫోటో తీయాలని విధానాన్ని ప్రవేశపెట్టారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ విధానాన్ని రద్దుచేసి సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపడతామని అందుకు అన్ని వర్గాల ప్రజలు ప్రజా సంఘాలు కలిసి రావాలని వెంకట్ పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు రాష్ట్ర ఆఫీస్ బెరర్స్ బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ, నారీ ఐలయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, కొండమడుగు నర్సింహ, ములకలపల్లి రాములు, జగన్, జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరుపంగి స్వామి, కూకుట్ల చొక్కాకుమారి, పల్లెర్ల అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులుగాడి శ్రీనివాస్, కొండాపురం యాదగిరి, దొడ్డి బిక్షపతి నాయకులు ఎరుకల బిక్షపతి, మేకల బాబు, ఓవల్దాస్ సతీష్, సతీష్, శ్రీరాములు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కాలనీలో వైద్య శిబిరం



జమ్మికుంట జూలై 24 (వాయిస్ టుడే): గురువారం రోజు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట మున్సిపల్ పరిధి అంబేద్కర్ కాలనీలో డాక్టర్ మహోన్నత పటేల్ మరియు మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో 54మంది కాలనీ ప్రజలకి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరిగినది. 4 గురు జ్వర పీడితులకు రక్త నమూనాలను సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించనైనది. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు అసంక్రామిత వ్యాధులు రక్త పోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ కాలనీ వాస్తవ్యులకు సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్య మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత మరియు డ్రైడే ప్రత్యేకత గురించి దోమల నివారణ మరియు అవి కుట్ట కుండా తీసుకోవలసిన జాగ్రత్తలను కాలనీ ప్రజలకు అవగాహన కల్పించనైనది.

ఈ కార్యక్రమములో డాక్టర్ మహోన్నత పటేల్,మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్,హెల్త్ సూపర్ వైజర్స్ రత్నకుమారి అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్,ఏఎన్ఎంలు మంజుల, రజిత మరియు ఆశా కార్యకర్తలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నీలోజుపల్లిలో మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి జూలై 24: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి కెటిఆర్ కానుకగా పంపించిన గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా కేసీఆర్ కిట్లు నీలోజిపల్లి గ్రామంలో పంపిణీ చేసిన మాజీ వైస్ ఎంపీపీ కొనుకటీ నాగయ్య బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు అనుముల భాస్కర్ మరియు సంపత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి,ఎర్ర శ్రీనివాస్,కొనుకటీ అంజన్ కుమార్,కొనుకటీ కమలాకర్,కొనుకటీ తిరుపతి,కొనుకటీ రాములు,పెంతాల రాజు,ఆవుల మల్లయ్య,గూడ మధుకర్,సిరిరెడ్డి లక్ష్మణ్,మరియు తదితరులు పాల్గొన్నారు.

# బయటపడుతున్న స్మార్ట్ సిటీ నాణ్యత వైఫల్యాలు

### గత పాలకవర్గ నిర్వాకం వల్లే నగర ప్రజలకు కష్టాలు

### తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి అధికారులపై నిందలా ?: దొంతి గోపి



కరీంనగర్,జూలై 24(వాయిస్ టుడే): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న నగరంలోని 30వ డివిజన్ మారుతి నగర్ కు చెందిన పలు ప్రాంతాలను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతి గోపి, కరీంనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యాడ వేణు సందర్శించారు.డివిజన్ ప్రజలు చెప్పిన పలు రోడ్లు మరియు డ్రైనేజీ సమస్యలను టెలిఫోన్ ద్వారా సంబంధిత డివిజన్ వార్డ్ ఆఫీసర్ మరియు మున్సిపల్ జవాన్ దృష్టికి తీసుకువెళ్ళారు.ఈ సందర్భంగా దొంతి గోపి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనుల పేరుతో బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు ఉమ్మడిగా చేపట్టిన నాణ్యతలేని స్మార్ట్ సిటీ పనుల వైఫల్యాలు నేడు నగర ప్రజలకు నరకం చూపిస్తున్నాయని,కేవలం ఎన్నికల ఓట్ల రాజకీయాలలో భాగంగా అభివృద్ధి పేరుతో అవినీతి సొమ్ము దాచుకోవడానికి నాణ్యతలేని పనులు చేపట్టడం వల్ల నేడు నగరంలో కురుస్తున్న వర్షాలతో కరీంనగర్ కార్పొరేషన్ జల దిగ్బంధనం అయిందని పేర్కొన్నారు.అయితే ఇది అధికారుల నిర్లక్ష్యం అంటూ బిజెపి నేత మాజీ మేయర్ వై సునీల్ రావు తమ వైఫల్యాన్ని కప్పించుకునే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని, కోట్లు ఖర్చుపెట్టి నగరంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాలు, ఐలాండ్ ల నిర్మాణాలు,అండర్ గ్రౌండ్ మంచినీటి పైప్ లైన్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం,సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లనే నేడు వరద నీరు రోడ్లపైకి వచ్చి జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని దుయ్యబట్టారు,గతంలో నగరంలోని స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్లో అవినీతి నెలకొందని, దానిపై విచారణ జరిపించాలని బిఆర్ఎస్ నేతలు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వానికి,ఎంపీ బండి సంజయ్ కి ఫిర్యాదు చేసినా,ఎవరూ స్పందించలేదని గుర్తు చేశారు.తమ స్వప్రయోజనాల కోసం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం,పలు ప్రాంతాల్లో చేపట్టని పనుల పేరుతో నిధులు స్వాహా చేయడం ఈ విధంగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేసినారని ఆరోపణలు ఎదుర్కొన్నారని అన్నారు. వరద నీరు రోడ్లపైకి, ఇండ్లలోకి రాకుండా పక్కా ప్రణాళికలు రూపొందించకపోవడంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్,అలుగునూర్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా వద్ద వరద నీరు రోడ్లపై చేరడం,స్మార్ట్ సిటీ పనులకు కేరాఫ్ అడ్రస్ గా చెప్పుకుంటున్న హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇండ్లలోకి వరద నీరు చేరడం వీటన్నింటికీ ప్రణాళిక లోపమే కారణమని స్పష్టంగా చెప్పవచ్చని అన్నారు.9 సంవత్సరాలు నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ను ఏలిన బిఆర్ఎస్ పాలకవర్గం డంపింగ్ యార్డ్ సమస్య గాని వరద నీటి సమస్య గాని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడంలో గాని ఎలాంటి శ్రద్ధ చూపలేదని ఎద్దేవా చేశారు.ఈ దుస్థితికి కారకులైన బిజెపి,బీఆర్ఎస్ ప్రతినిధులను ప్రజలు నిలదీయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కోనే మహర్షి, రాజు, నవీన్, పాషా, అజయ్, రేవంత్, భువన్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులను వేధిస్తే...ఖబర్దార్

**బీసీ బిల్లు పై నోరుమెదపని కౌశిక్ రెడ్డిని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుంది...**

**ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ వార్నింగ్...**

**పీసీసీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హుజూరాబాద్ నియోజకవర్గంలో తొలి పర్యటన...**



జమ్మికుంట జూలై 24 (వాయిస్ టుడే): పీసీసీ ఉపాధ్యక్షులుగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హుజూరాబాద్ నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కు గురువారం జమ్మికుంట పుర పరిధిలో ని కొత్తపల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నాయకులను వేధిస్తే...తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి స్వయంగా నియోజకవర్గానికి ఏమీచేయలేకపోయినా కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు అందించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కమలాపూర్ లో ప్రజలకు కల్యాణలక్ష్మీ చెక్కులు అందిస్తే స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చెక్కుల కాలం పూర్తి అయిపోయిన తర్వాత ఇచ్చాడంటే ఎంత నిర్లక్ష్యమో అర్థం చేసుకోవచ్చు అని ఎద్దేవ చేశారు.రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని కారుకు ఉన్న నాలుగు చక్రాలను నలుగురు పీక్కు పోయారని కారు డ్రైవర్ ఫామ్ హౌస్ లో పన్నాడని ఇకనైనా కౌశిక్ రెడ్డి ఇతర పార్టీల గురించి మాట్లాడడం మానేసి తన పార్టీలో ఉన్న పరేషాన్ పట్టించుకోవాలని సూచించారు .ఇకనైనా టిఆర్ఎస్ పార్టీ బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్లపై స్పందించకుంటే కౌశిక్ రెడ్డిని నియోజకవర్గంలోని బీసీలు రాళ్లతో కొట్టి తరిమేసే పరిస్థితి వస్తుందని తీవ్రంగా దుయ్యబట్టారు .

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ యెగెలుస్తుందని ,పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుర్తుంచుకొని నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ నాయకులతో కలిసి గెలిపించుకునే బాధ్యత మాదే అని అన్నారు . అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా, నియోజకవర్గ బాధ్యులు, జిల్లా నేతలను కలుపుకుని గెలిపించడానికి కృషి చేస్తానని, చెప్పారు.

### ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా

చుట్టూ 100 గ్రామాల నుండి వైద్యం కోసం వచ్చే జమ్మికుంట ప్రభుత్వా ఆస్పత్రి అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని ,ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండే విధంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తో మాట్లాడి ఆస్పత్రిలో కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయిస్తానన్నారు .వ్యాపార కేంద్రమైన జమ్మికుంట నుండి హైదరాబాదుకు లోగడ నిత్యం బస్సులు నడిచేవని వాటిని కూడా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి బస్సుల పునరుద్ధరణకు చొరవ చూపిస్తానని ,బస్సులు ప్రారంభమైన మొదటి రోజు తానే స్వయంగా హైదరాబాద్ నుండి జమ్మికుంటకు బస్సులో ప్రయాణిస్తానని జమ్మికుంట ప్రజలకు హామీ ఇచ్చారు .కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరుకాల వీరేశలింగం ,పొనగంటి మల్లయ్య ,ఎగ్గని శ్రీనివాస్ , కృష్ణమోహన్, ఎర్రబెల్లి రాజేశ్వరరావుల తోపాటుకాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలుపాల్గొన్నారు.

## బిఆర్ఎస్ తాజా మాజీ సర్పంచ్ కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర, జూలై 24(వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి భర్త తాళ్ల రవి గత పది రోజుల క్రితం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో అప్పులు చేసి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పులకు వడ్డీలు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొన్నాడు.చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురైన తాళ్ల రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి భరోసా కల్పించారు.రవి చికిత్స కోసం దాదాపు 4 లక్షల రూపాయల ఖర్చులు కాగా ఎమ్మెల్యే సత్యం పూర్తిగా ఖర్చులు భరించి రవికి చికిత్స చేయించారు.బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన సర్పంచ్ కుటుంబం అని చూడకుండా పార్టీలకు అతీతంగా మానవత్వంతో రవికి చికిత్స చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యముకు అభినందనలు వెల్లువెత్తాయి.తమ కుటుంబానికి అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకున్న ఎంఎల్ఏ మేడిపల్లి సత్యంకు తాళ్ల రవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## బెట్టింగ్ ఓ యువత కథ షార్ట్ ఫిలిం డైరెక్టర్ చౌదరి శివకుమార్‌కు ఘన సన్మానం

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.జులై 24: జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణానికి చెందిన లోకల్ టాలెంట్ మెటుపల్లి బ్యానర్ పై నిర్మించిన బెట్టింగ్ ఒక యువత కథ షార్ట్ ఫిలిం యూట్యూబ్లో ప్రజాద రణ పొందుతున్న శుభసందర్భంగా బెట్టింగ్ ఓ యువత కథ షార్ట్ ఫిలిం డైరెక్టర్ చౌదరి శివకుమార్ ను మెటుపల్లి పెయింటర్స్%ు% పి ఓ పీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షడు ఏశమేని గణేష్ సంఘం సభ్యులతో కలిసి శాలువకప్పి సన్మానం చేశారు. తమ తోటి పెయింటర్ సోదరుడు చౌదరి శివకుమార్ తీసిన సినిమా సక్సెస్ అయినందుకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు శివ చౌదరి మాట్లాడుతూ.. బెట్టింగ్ ఓ యువత కథ యూట్యూబ్ లో విడుదల చేసిన వెంటనే అత్యధిక ప్రజాదరణ పొందుతుందని అన్నారు. ఓ సందేశాత్మక చిత్రాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలియజేశారు. చిత్రంలో నటించి,తోడ్పాటు అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏశమేని గణేష్, ఉపాధ్యక్షుడు పొన్నాల ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి బిజినపల్లి మనోహర్,రైటర్ అంకమల్ల మహేష్,కార్యదర్శి కాతా వినయ్, జనగాం నరసింహులు,జనగాం సంపత్,మారంపల్లి రాజశేఖర్, సేలార్ ఖాన్,రాజయ్య, అబ్దుల్ వహీద్, అల్లాడి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టంపై అవగాహన సదస్సు




వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జూలై 24: పాలమూరు కేంద్రం లోని జలజం జూనియర్ కళాశాల మహబూబ్ నగర్ జిల్లా లో లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఇందిర, న్యాయ సేవా సంస్థ గురించి, డ్రగ్ అబ్యూస్ , ఇల్లిసిట్ ,ట్రాఫికింగ్ గురించి, బాలల హక్కులు చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, విద్యా హక్కు చట్టం, పిఓసిఎస్ఓ చట్టం, ర్యాగింగ్ నిషేధ చట్టం వివిధ రకాలైన చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ రమేష్ గౌడ్ , ప్రిన్సిపల్ చంద్రశేఖర్, రవికుమార్, రాజసింహుడు, సికందర్ , రాములు మరియు కళాశాల సిబ్బంది, బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కెటిఆర్ జన్మదిన వేడుకలు

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జులై 24: (జడ్చర్ల)నవాబు పేట. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో మండల. బి ఆర్ ఎస్. పార్టీ ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల. తారక రామారావు. జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించరు. పార్టీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయంల్లో పార్టీ కెటిఆర్ జన్మదిన కానుకగా మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమం ల్లో మండల పార్టీ అధ్యక్షులు. మడేమోని నర్సిములు. మాజీ జడ్పీటీసీ.రవీందర్ రెడ్డి, మాజీ. యం. పి. పి.శ్రీనివాస్.పార్టీ ప్రధాన కార్యదర్శి కరణం ప్రతాప్, మాజీ తాహేర్, పార్టీ యువత అధ్యక్షులు. శ్రీను,మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్, హన్మంతు.అబ్దుల్లా. యాదయ్య, నవనీత్,రాజు నాయక్,మల్లేపగా నర్సిములు,తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

**మహిళా సంఘాలు వ్యాపారంలోనూ రాణించాలి**

**ఇందిరా మహిళ శక్తి కింద ఎరువులు & విత్తనాల దుకాణాల ఏర్పాటు**

**రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జిల్లాలో 23 ఎరువులు & విత్తనాల కేటాయింపు**

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బోయినపల్లి మండలంలో 2 ఎరువులు & విత్తనాల దుకాణాలు ప్రారంభం**



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 24: ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఇందిరా మహిళా కింద బోయినపల్లి మండలం కేంద్రంలో ధరిత్రి మహిళా సమాఖ్య అలాగే విలాసాగర్ గ్రామంలో విలాసాగర్ గ్రామైక్య సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన ఎరువుల %ు% విత్తనాల దుకాణాలను చొప్పదండి ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైతన్నలకు ఉత్తమ సేవలు అందించేలా మహిళా సంఘాలకు ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 3 దుకాణాలు ప్రారంభించామని వివరించారు.ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ , ఐకెపి ఎపిఎం జయసుధ, తాసిల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, సేస్ డైరెక్టర్ సుధాకర్,మాజీ ఎంపీపీ వేణుగోపాల్ , ఏవో ప్రణీత, ఏఎంసి వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి ,నాయకులు సంభ లక్ష్మి రాజం, సువిన్ యాదవ్,మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కాలువ ద్వారా చెరువులు నింపి రైతులకు వ్యవసాయానికి తోడ్పాటు అందించండి

ఆసిఫ్ నగర్, జూలై 24(వాయిస్ టుడే): కొత్తపల్లి మండలంలోని గ్రామాలకు వరుద కాలువ ద్వారా నిరందించాలని కోరుతూ ఆసిఫ్ నగర్ గ్రామ రైతులు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బీజేపీ నాయకుడు కడారి శ్రీనివాస్ మాట్లాడుతూ వరద కాలువకు గంగాధర మండలం ఆచంపల్లి వద్ద నిర్మాణాలు చేపట్టి కెనాల్ ద్వారా నాగులమల్యాల చెరువు నుండి కొండాపూర్ మీదుగా మిడ్ మానేర్ లెఫ్ట్ కెనాల్ ద్వారా బద్దిపల్లి వరకు నీళ్ళు వస్తాయి. కాని కొండాపూర్ వద్ద కెనాల్ కు నిర్మాణం చిన్నగా పెట్టారు దాని ద్వారా చెరువులు నిండడం లేదు. కాబట్టి దానికి సమీపంలో ఒక నిర్మాణం చేపట్టి కొండాపూర్ కొడిపికుంట, బాపుపేట చెరువు, ఎలగందల్ చెరువు, బద్దిపెల్లి చెరువు మరియు కమాన్పూర్ చెరువు నిండి రైతులకు సౌలభ్యంగా ఉంటుంది. కావున వెంటనే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడారి శ్రీనివాస్, ఉప్పు అశోక్, గొంటి కరుణాకర్, పెద్ది సత్యం, చిచ్చుల కుమార్, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఢిల్లీకి వెళ్లిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 24: ఢిల్లీలో జరిగే ఓబిసి నాయకుల సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ తో పాటు పలువురు నాయకులు తరలి వెళ్లారు. శుక్రవారం ఢిల్లీ లోని తల్క టోర స్టేడియంలో జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే ఆద్యరంలో జరిగే సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం మేరకు ఢిల్లీకి వెళ్లారు దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ వర్గాలను ఏకయం చేయడంలో మరి అవగాహన కల్పించడంలో ఇట్టి సమావేశం జరగనుండగా కూస రవీందర్ తో పాటు ముత్యం శంకర్ నాగుల వంశగౌడ్ , శాలివాహన శ్రీనివాస్ తదితరులు ఢిల్లీకి తరలి వెళ్లారు

## కేటీఆర్ కే కేసీఆర్ కిట్టు అందజేసిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్




వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 24: బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్బంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం చేపట్టి ఎంతో మంది పేదలకు, విద్యార్థులకు, సహాయం చేయగా, ఈ సారి వినూత్నంగా కేసీఆర్ కిట్టు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పంపిణి చేయగా బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త గంగిపెల్లి రాజశేఖర్- కవిత దంపతులకు గత నెలల క్రితం కొడుకు జన్మించగా, ఒటీఆర్ మీద అభిమానం తో వారి కుమారునికి కేటీఆర్ అని నామకరణం చేసారు. కేటీఆర్ జన్మదినం సందర్బంగా వారికీ చొప్పదండి మాజీ శాసన సభ్యులు సుంకె రవిశంకర్ స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి కేసీఆర్ కిట్టు అందజేశారు. కేటీఆర్ కే కేసీఆర్ కిట్టు వచ్చిందని ఈ సందర్బంగా అ దంపతులు ఆనందం వ్యక్తం చేసారు.

## కరీంనగర్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కరీంనగర్, జూలై 24(వాయిస్ టుడే): మాజీ మంత్రి బీ.ఆర్.ఎస్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన సందర్భంగా బీ.ఆర్.ఎస్. పార్టీ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో బారి కేక్ కట్ చేసిన అనంతరం పూల మరియు పండ్ల మొక్కలు మరియు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ ప్రగతి ప్రధాత ప్రజాభిమాన నేత యూత్ ఐకాన్ నవ శకానికి నాంది పలికిన నాయకుడు నవతరానికి నడక నేర్పిన నాయకుడు అని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించి యువతకు మార్గదర్శకుడు అయ్యారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కొత్తపెల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు గందె మాధవి మహేష్, గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్, ఐలేందర్ యాదవ్,వాల రమణ రావు, కోలా మాలతి సంపత్ రెడ్డి, కంసాల శ్రీనివాస్, జెడ్పి మాజీ కోఆప్షన్ సభ్యులు జమీలుద్దీన్, కొత్తపెల్లి మండల మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, బిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నగర యూత్ ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయి కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్, బిఆర్ఎస్వి నగర యూత్ అధ్యక్షులు బొంకూరు మోహన్,విద్యార్థి విభాగం శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ కొత్తపెల్లి మండల అధ్యక్షులు కాసారం శ్రీనివాస్,బిఆర్ టి యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు డివిజన్ ఇన్చార్జులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు, బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజూర్ నగర్ పట్టణంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

## స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ అంతా సిద్ధపడాలి

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, హుజూర్నగర్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి



హుజూర్ నగర్ జూలై 24 (వాయిస్ టుడే ప్రతినిధి): గురువారం బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ. కల్వకుంట్ల తారకరామారావు జన్మదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా,హుజూర్ నగర్ పట్టణంలో అమరవీరుల స్తూపం సెంటర్లో హుజుర్ నగర్ మాజీ జెడ్పిటిసి డాక్టర్.కొప్పుల సైదిరెడ్డి మరియు హుజుర్ నగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన హుజూర్ నగర్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి కేక్ కట్ చేసి, హుజూర్ నగర్ నియోజకవర్గ ప్రజలు,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల పక్షాన కల్వకుంట్ల తారకరామారావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలంగాణ భవిష్యత్తు, కాబోయే ముఖ్యమంత్రి కేటీఆర్ అని,బి.ఆర్.ఎస్ పార్టీకి ఆయన దిక్సూచిగా ఉన్నారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పఠంలో నిలిపిన ఘనత ఒక్క కేటీఆర్ కె సొంతం అని తెలిపారు. మరియు కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో వారు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆ భగవంతుణ్ణి నిండు మనసుతో వేడుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాదు పార్టీ అధికారం లేనప్పుడు పార్టీని అడ్డుపెట్టుకున్నవాళ్లే పార్టీకి నమ్మకస్తులు, అని ఈరోజు కెసిఆర్ ఇబ్బందులలో ఉంటే, పార్టీకి వెన్నుపోటు పొడిచి పార్టీ ఫిరాయించడం అంటే ఈ ప్రాంత ప్రజలను మోసం చేయడమే అని, నిజంగా నైతిక విలువలతో కూడిన రాజకీయం చేయాలనుకుంటే, పార్టీలోనే ఉంటూ పార్టీ కోసం పనిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో.హుజుర్ నగర్ మాజీ జెడ్పిటిసి డాక్టర్.కొప్పుల సైదిరెడ్డి సీనియర్ నాయకులు కే.ఎల్.ఎన్.రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, అబ్దుల్ నబీ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, కార్మిక విభాగాల హుజూర్నగర్ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిపాల ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ వీరబాబు, బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ లు సైదేశ్వర రావు, కీత జయమ్మ దనమూర్తి, షేక్ అలీ, రమ్య నాగరాజు, మాజీ ఎంపీటీసీ చీకురు రాజారావు, హుజూర్నగర్ యూత్ అధ్యక్షులు వీరమల్ల సుందరయ్య,

హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు తోట బిక్షం, నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు షేక్.హుస్సేన్ మియా, సారెడ్డి భాస్కర్ రెడ్డి, జానీ పాషా, మరియు మట్టారెడ్డి, బాలసైదులు, గ్రామ శాఖ అధ్యక్షులు వెంగల్ రావు, కీత కృష్ణమోహన్, ముజిబ్,దావీదు, ఇస్మాయిల్, సముల లింగారెడ్డి, వెంకటేశ్వర్లు,పాయల శ్రీను, బ్రహ్మారెడ్డి, సైదులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, శ్రీను, సీనియర్ నాయకులు మల్లెపల్లి నరసింహారావు, వెంకటేశ్వర్లు, పరశురాం, చీకురు నారాయణ, జడ అంజి, పారేపల్లి నరసింహారావు, వెంకన్న, చంటి, చంద్ర గిరి, కొరివి వీరయ్య, రాము, నాగ శేషరాజు, గండు సైదులు, దొంతగాని భాస్కర్, గొట్టే గోపాలు, అలవాల నరేష్ పులిచింతల చంటి, నాగరాజు, లక్ష్మీనర్సు, దశరథ, బాల సైదా దగడ గోపి, రవీందర్, కస్తాల రామకృష్ణ, లోకేష్, బ్రహ్మారెడ్డి, జనిగ వినయ్, రాగి రాజశేఖర్ జక్కుల వెంకటేశు ,తురక నరసింహారావు, వినాయక రావు, పల్లె సంతోష్ రెడ్డి విద్యాసాగర్, మహిళ నాయకురాళ్లు రత్నశ్రీ, నాగమణి, మంగమ్మ, షేక్ రహీమ, నాగమణి,పద్మ, త్రివేణి,భవాని, లక్ష్మి,మరియు పట్టణ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల సభ్యులు, మండల, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




## స్థానికఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీచేస్తుంది

తొర్రూరు, జులై 24 వాయిస్ టుడే : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, బీజేపీ విజయం కోసం కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని, కష్టపడి పని చేసి విజయం కోసం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తొర్రూరు మండల కేంద్రంలోని స్థానిక కిరాణా మర్చంట్స్ ఫంక్షన్ లో బీజేపీ తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు.ఈసందర్భంగా లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీ లకు నేరుగా నిధులు విడుదల చేసి గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నారు అని,నేడు గ్రామాల్లో జరిగే ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందని, నరేంద్ర మోడీ సహకారం తోనే పల్లెల్లో సీసీ రోడ్లు,వీధి లైట్లు, వైకుంఠ ధామాలు, ఇంటింటికీ మరుగుదొడ్లు, పేదలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ప్రతీ ఒక్కరికీ ఐదు కిలోల చొప్పున ఉచిత రేషన్ బియ్యం, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అందరికీ ఉచిత వైద్యం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునని, ప్రజలు బీజేపీ పార్టీ పట్ల సానుకూల దృక్పథం తో ఉన్నారని,పది సంవత్సరాలు ప్రజల సొమ్మును దోచుకొని దాచుకున్న టీఆర్ఎస్ కు, అలవి కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీ లకు రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని,ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని, నిత్యం గ్రామాల అభివృద్దే దేశాభివృద్ధి అంటూ అభివృద్ధి మంత్రం జపిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ పార్టీ ని ఆదరించి ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తంచేశారు.ఈ సమావేశంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లె కుమార్,నిమ్మల సంపత్, అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్,మండల ప్రధాన కార్యదర్శులు కొండా యాకన్న, భాస్కర్ నాయక్, జిల్లా నాయకులు బొచ్చు సురేష్,ఆర్.రాజ కుమార్,విష్ణు వర్ధన్ చారి,కాగు నవీన్, శ్రీనివాస్ నాయక్,నూకల నవీన్,గుండా సురేష్, రవితేజ, సంతోష్, శివ, శ్రీకాంత్,విశాల్,సామంత్,భషీర్, సురేష్, సోమశేఖర్, శ్రీనివాస్, నవీన్, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### దరఖాస్తుల పరిష్కారానికి, చర్యలపై కలెక్టర్ సమీక్షా సమావేశం

హనుమకొండ, వాయిస్ టుడే: భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి తో కలిసి హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాలకు సంబంధించి భూభారతి దరఖాస్తుల డేటా ఎంట్రీ, నోటీసుల తయారీ, జారీ సంబంధించిన వివరాలను తహసీల్దార్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులకు ఆన్లైన్ లో నోటీసులు తయారు చేసి అందించాలన్నారు. భూభారతి దరఖాస్తులు వంద శాతం డేటా ఎంట్రీ పూర్తికావాలన్నారు. గ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. డేటా ఎంట్రీ కి తగిన సిబ్బందిని కేటాయించాలని తహసీల్దార్లకు సూచించారు. రెవెన్యూ గ్రామాల వారిగా డేటా ఎంట్రీ చేయాలన్నారు. భూభారతి దరఖాస్తుల డేటా ఎంట్రీ, నోటీసుల తయారీ, నోటీసుల జారీ, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లకు కలెక్టర్, అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### శాఖా పరమైన అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం



హనుమకొండ, వాయిస్ టుడే: అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న బాల రక్షాభవన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సఖి వన్ స్టాప్ సెంటర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, చైల్డ్ హెల్ప్ లైన్ - 1098, పరకాల, భీమదేవరపల్లి, హనుమకొండ ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లతో శాఖా పరమైన అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనుబంధ సంస్థలు ముఖ్యంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడి కేంద్ర లబ్ధిదారులకు అందించే సేవలు ప్రణాళిక ప్రకారం అందించాలన్నారు. గర్భిణులు ఎంత బరువు ఉన్నారు, ఎంత శాతం రక్తం పెరుగుతున్నదనే వివరాలను నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు తరచుగా వస్తున్నారా లేదా అనే వివరాలతో పాటు క్షేత్ర స్థాయిలో విచారించి ఆ వివరాలను అందజేయాలన్నారు. పలు అంశాలలో తక్కువగా అంగన్వాడీ కేంద్రాలను సిడిపివోలు సందర్శించి వాటి బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల సంఖ్య పెరగాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల సంఖ్య, ప్రభుత్వ పాఠశాలలకు ఎంతమంది వెళ్తున్నారు, ప్రైవేటు పాఠశాలలకు ఎంతమంది వెళ్తున్నారని వివరాలను నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను లోప పోషణ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలల పరిరక్షణ విభాగం, శిశు గృహకు సంబంధించిన అవసరాలను అడిగి తెలుసుకొని సత్వర చర్యలకు సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి, సిడిపివోలు విశ్వజ, స్వాతి, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సి.హెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ టి సుమలత, పర్యవేక్షణ అధికారులు బి, భాగ్యలక్ష్మి,కళ్యాణి, సరిత, సూపర్వైజర్లు అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అన్ని రకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

### తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

తొర్రూరు, జులై 24 వాయిస్ టుడే : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం నర్సింహులపేట మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జంజిరాల నాగరాజు మాట్లాడుతూ అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం పెండింగ్ డీ.ఏలను పి.ఆర్సి ని వెంటనే ప్రకటించాలని, 317 సబ్ కమిటీ రిపోర్ట్ బయట పెట్టి 317 బాధితులకి న్యాయం చేయాలి అని,అదేవిధంగా ఓకే ఇంకా అదే విధంగా ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ 010 కింద వేతనాలు చెల్లించాలని, అడహాక్ పద్దతి లో ప్రమోషన్స్ ఇవ్వాలి అని వివిధ గురుకులాలలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా సమయసారిని ఉండాలని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులకు టైం స్కేల్ వర్తింపజేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహాదేవుని వీరేశం, తాళ్లపల్లి రాజు, దంతాలపల్లి ప్రధాన కార్యదర్శి అమరగొండ మహేందర్, కుందారపు బాలలింగం మొదలగువారు పాల్గొన్నారు.



## డీఆర్ఎం భర్తేష్ కుమర్ జైన్ కు ఇన్వెస్టిచేర్ సెరమని




వాయిస్ టుడే, హనుమకొండ: దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ డివిజన్ సంచాలన్ భవన్లో డివిజన్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమర్ జైన్ మరియు మాలిని జైన్ కు స్కౌట్స్ అండ్ గైడ్స్ డ్రిస్టిక్ ట్రైనింగ్ కమిషనర్లు ఎర్ర ఏలీయా, కొంపల్లి సునీత ఆధ్వర్యంలో గురువారం ఇన్వెస్టిచేర్ సెరమని నిర్వహించారు. ఈ సందర్భంగా డిటీసీ ఏలీయా మట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గానేషన్ కు ప్రెసిడెంట్ గా డీఆర్ఎం వ్యవహరిస్తారన్నారు. గతంలో ఉన్న డీఆర్ఎం ఇటీవల స్థానచలనం అవ్వగా నూతన డీఆర్ఎం గా నియమితులైన భర్తేష్ కుమార్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గానేషన్ కు ప్రెసిడెంట్ గా డీఆర్ఎం ప్రామిస్ చేసి డివిజన్ పదవి భాధ్యతలు స్వీకరించారని ఏలీయా మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఇనస్పెక్టర్ సి.హెచ్ సరళ మాధవి, సికింద్రాబాద్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డివిజనల్ ఆర్గనైజేషన్ కమిషనర్లు ప్రశాంత్, బక్క శోభారాణి, సురేష్ బాబు, ఆల్ఫ్రెడ్ రూబిన్, బొబ్బిలి శ్రీధర్, బక్క కృప, నళినీ కాంత్, విద్యాసాగర్, పాల్గొన్నారు.

# తెలంగాణకు భవిష్యత్ ఆశా కిరణం కేటీఆర్: దాస్యం

## మొక్కలు నాటిన వినయ్ భాస్కర్





హనుమకొండ, వాయిస్ టుడే: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ఉద్యమ నేత, తెలంగాణ అభివృద్ధి ప్రదాత కెసిఆర్ అడుగుజాడల్లో నడుస్తూ తెలంగాణకు భవిష్యత్ ఆశా కిరణం కేటీఆర్ అని కొనియాడారు. కేటీఆర్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేటీఆర్ నిండు నూరేళ్లు అష్టఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు సైతం నిర్వహించామని విజయ్ భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రధాన కూడళ్లో బీఆర్ఎస్ శ్రేణులు కేక్ కటింగ్, అన్నదానం మరియు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, సీనియర్ నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, జానకిరాములు, సల్వాజీ రవీందర్ రావు, ఇమ్మడి రాజు, సదాంత్, కోటిలింగం, కోటేశ్వర్ రావు (చిన్న), సౌరం రఘు, యాకుబ్, మహేందర్, దేవమ్మ, భిక్షపతి, గౌస్ ఖాన్, బచ్చు అనిల్ కుమార్, ఉదిత్, కిషోర్, యువనాయకులు ఆర్.కే నరేంద్ర, మంద సృజన్, తెలంగాణ శ్రవణ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### కాజీపేటలో కేటిఆర్ జన్మదిన వేడుకలు..

తెలంగాణ భవిష్యత్తు కోసం నిత్యం శ్రమించే నాయకుడు, యువతకు ఆదర్శప్రాయుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అని మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం కేటిఆర్ జన్మదినం సందర్భంగా హన్మకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వినయ్ భాస్కర్ మొక్కలు నాటారు. అనంతరం కాజీపేట జంక్షన్ లో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, నార్లగిరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.